## పేదల కడుపు నింపిన 'ఏబీఏపీ' భక్తులు

- రాష్ట్ర అధ్యక్షుడు బేతి తిరుమల్ రావు

దాతలను సన్మానిస్తున్న ఏబీఏపీ సభ్యులు

మంచిర్యాల ఏసీసీ, మే 29 : 40 రోజుల పాటు మండుటెండలో పట్టణంలోని, పట్టణానికి వచ్చిన నిరుపేదలకు అఖిల భారత అయ్యప్ప ధర్మ ప్రచార సభ (ఏబీఏపీ) పెరుగన్నంతో ఆకలి తీర్చిందని రాష్ట్ర అధ్యక్షుడు బేతి తిరుమల్ రావు పేర్కొన్నారు. మంచిర్యాల ఐబీ చౌరస్తాలో జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చుంచు రాజ్‌కిరణ్, అయ్యప్ప భక్తులు నిర్వహిస్తున్న పెరుగన్నం పంపిణీ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమంలో అయ్యప్ప గురుస్వామి, వేదపడితుల సంగణబట్ల నరహరి శర్మతో కలిసి రాష్ట్ర అధ్యక్షుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 40 రోజులుగా అడవుల్లో జంతు పక్షులకు ఆహార పదార్థాలు, మంచినీరు సరఫరా చేసినట్లు తెలిపారు. అనంతరం పెరుగన్నం దాతలను ఏబీఏపీ ఆధ్వర్యంలో శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏబీఏపీ గౌరవ అధ్యక్షుడు కొండు నర్సింహారావు, ప్రధాన కార్యదర్శి ఎల్క సంతోష్, ఉపాధ్యక్షుడు ఒడ్నాల రవీందర్, కోశాధికారి బడ్డ లక్ష్మణ్, సహాయ కార్యదర్శి సిరిపురం రాజేశం, బేతి సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## అంబులి పంపిణీ చేసిన కౌన్సిలర్

మంచిర్యాలలోని ఐబీ చౌరస్తాలో అంబులి పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ సంజీవ్

మంచిర్యాలటౌన్, మే 29 : కొక్కిరాల రఘుపతిరావు చాలిటబుల్ ట్రస్ట్ ద్వారా మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు, డీసీసీ అధ్యక్షురాలు సురేఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంబులి పంపిణీ కార్యక్రమం బుధవారంతో 32వ రోజుకు చేరుకున్నది. కాగా, 24వ వార్డు కౌన్సిలర్ వేములపల్లి సంజీవ్ ఆధ్వర్యంలో వార్డు ముఖ్య నాయకులు, కార్యకర్తలు మంచిర్యాలలోని ఐబీ చౌరస్తా, బస్టాండ్ వద్ద అంబులి పంపిణీలో పాల్గొన్నారు. మంచిర్యాలలో ఐబీ చౌరస్తా, బస్టాండ్, మార్కెట్‌ఏరియా, సీసీసీ నస్పూర్, శ్రీరాంపూర్, లక్షెట్టిపేటల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల ద్వారా రోజూ 1500 లీటర్ల అంబలి పంపిణీ చేస్తున్నట్లు కౌన్సిలర్ సంజీవ్ తెలిపారు.

## దేవాపూర్‌లో సీసీ కెమెరాలు ప్రారంభం

కాసిపేట, మే 29 : కాసిపేట మండలంలోని దేవాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆరు కమ్యూనిటీ సీసీ కెమెరాలను దేవాపూర్ ఎస్ఐ ఆంజనేయులతో కలిసి మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదపడుతాయని సీఐ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## గ్రామాలాభివృద్ధే ధ్యేయం

జన్నారం, మే 29 : గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పేర్కొన్నారు. మండలంలోని రాం తండా, కవ్వాల్, హాస్టల్ తండా, లోతొర్రె, బంగారు తండా, కొత్తూర్ పల్లె, లక్ష్మీపూర్ తండా గ్రామాల్లో బుధవారం పర్యటించారు. ప్రజల సమస్యలు తెలుసుకునారు. కొత్తూర్ పల్లె చెరువును కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డీఈతో ఫోన్లో మాట్లాడి ఆదేశించారు. మండలాధ్యక్షుడు, ముజఫర్ అలీఖాన్, ప్రధాన కార్యదర్శి మేకల మాణిక్యం, నాయకులు, ఏనుగు శుభాష్‌రెడ్డి, సయ్యద్ ఇసాక్, జిల్లా ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు రియాజొద్దీన్ పాల్గొన్నారు.

# నేను తెచ్చిన నిధులతోనే అభివృద్ధి

- ఇప్పటివరకు కొక్కిరాల ఒక్కరూపాయి తేలే
- మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు
- రైల్వే అండర్ బ్రిడ్జి-తిలక్‌నగర్ వరకు రోడ్డు పనుల పరిశీలన

తిలక్‌నగర్ రోడ్డు పనులను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్, మే 29 : కేసీఆర్ ప్రభుత్వ హయాంలో తాను తెచ్చిన నిధులతోనే మంచిర్యాల పట్టణంలో అభివృద్ధి పనులు సాగుతున్నాయని, ఇక్కడి ఎమ్మెల్యే ఇప్పటివరకు ఒక్కరూపాయి కూడా తీసుకురాలేదని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. మంచిర్యాల మున్సిపాలిటీ పరిధి రైల్వే అండర్ బ్రిడ్జి నుంచి తిలక్‌నగర్ వరకు రూ.5.85 కోట్లతో నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణ పనులను బుధవారం బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా దివాకర్‌రావు మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో వచ్చిన నిధులతో టెండర్లు పూర్తయిన పనులను త్వరితగతిన చేపట్టాలన్నారు. అభివృద్ధి పనులు యథావిధిగా కొనసాగాలని డిమాండ్ చేశారు. అధికారంలో ఎవరున్నా ప్రజలకోసమే పనిచేయాలని, ఎక్కడా పక్షపాత ధోరణి అవలంబించరాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ప్పటి నుంచి మంచిర్యాలకు పైసా రాలేదని, వీలైనన్ని ఎక్కువ నిధులను తీసుకువచ్చి అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు గాదె సత్యం, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అంకం నరేశ్, నాయకులు తాజొద్దీన్, శ్రీరాముల మల్లేశ్, కర్రు శంకర్, తోట తిరుపతి, శ్రీపతి శ్రీనివాస్, పడాల శ్రీనివాస్, మహ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

# మాదక ద్రవ్య రహిత సమాజమే లక్ష్యం

- మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్

మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్, చిత్రంలో రామగుండం సీపీ శ్రీనివాస్

నస్పూర్, మే 29 : మాదక ద్రవ్య సమాజమే లక్ష్యంగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్ సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం రామగుండం సీపీ శ్రీనివాస్, డీసీపీ అశోక్‌కుమార్‌తో కలిసి మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీవోలు రాములు, హరికృష్ణ, ఎక్సైజ్ అధికారి నంద గోపాల్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ చందన, మానసిక వైద్య నిపుణులు సునీల్, డీఈవో యాదయ్య, కేంద్ర పన్ను శాఖ అధికారి శ్రావన్‌కుమార్, జిల్లా సంక్షేమాధికారి చిన్నయ్య, జిల్లా వ్యవసాయాధికారి సురేఖ, ఇతర అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యా సంవత్సరంలో పాఠశాలలు, కళాశాలలు ప్రారంభమవుతాయని, విద్యార్థులకు మాదక ద్రవ్యాలు, గంజాయి ఇతరత్రా మత్తు పదార్థాలు వినియోగించడం వల్ల కలిగే నష్టాలను అర్థమయ్యేలా అవగాహన కల్పించాలన్నారు. అసాధారణ ప్రవర్తన కలిగిన విద్యార్థులకు కౌన్సెలింగ్ ద్వారా మార్పు తీసుకురావాలని తెలిపారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో గంజాయి సాగు జరుగకుండా మండలస్థాయి అధికారులు పటిష్ట చర్యలు చేపట్టాలని, ఉల్లంఘనకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం రామగుండం సీపీ మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాల రహిత సమాజ నిర్మాణమే ధ్యేయంగా పోలీసు శాఖ పనిచేస్తున్నదని, ఇప్పటి వరకు 22 కేసులు నమోదు చేశామని వివరించారు. టాస్క్‌ఫోర్స్ బృందాల ద్వారా చెక్‌పోస్టుల వద్ద విస్తృత తనిఖీలు చేపడుతున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో వైద్య ఆరోగ్య శాఖ జిల్లా సర్వైలెన్స్ డాక్టర్ ఫయాజ్ ఖాన్, మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

### నకిలీ విత్తనాల విక్రయాన్ని అరికట్టాలి..

జిల్లాలో నకిలీ విత్తనాల తయారీ, రవాణా, విక్రయం వినియోగాన్ని అరికట్టేలా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్నారు. వ్యవసాయ రంగంలో బీటీ పత్తి విత్తనాలతో పాటు బోల్‌గార్డ్ 1, 2 రకాలను చట్టబద్ధంగా ఉపయోగిస్తున్నారని, బోల్‌గార్డు-3 రకాన్ని నిషేధించారని తెలిపారు. వీటిని ఉపయోగించడం చట్టరీత్యా నేరమన్నారు. రైతులు వినియోగించకుండా వ్యవసాయాధికారులు అవగాహన కల్పించాలన్నారు. రైతులు సాగు చేస్తున్న విస్తీర్ణానికి అనుగుణంగా విత్తనాలు, ఎరువుల పంపిణీ జరిగేలా చూడాలని తెలిపారు. సీపీ మాట్లాడుతూ.. 4 నెలల్లో నాలుగు కేసులు నమోదు చేసినట్లు, ఈ నెల 28న రూ.16 లక్షల విలువ గల 550 కిలోల నకిలీ విత్తనాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

## పోలంపల్లిలో హద్దు రాళ్లు తొలగింపు

పోలంపల్లిలో హద్దు రాళ్లను తొలగిస్తున్న కార్యదర్శి సృజన, సిబ్బంది

భీమారం, మే 29 : భీమారం మండలం పోలంపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన అక్రమ వెంచర్ హద్దు రాళ్లను బుధవారం పంచాయతీ కార్యదర్శి సృజన తన సిబ్బందితో కలిసి తొలగించడంతో పాటు, నోటీసు ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. 'అక్రమాల చంద్రుడిని అడ్డుకునేదెవ్వరు' అని మంగళవారం 'నమస్తే'లో వచ్చిన కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. ఈ మేరకు డీపీవో అధికారులను ఆదేశించారు. దీంతో హద్దురాళ్లను తొలగించారు. ఈ సర్వే నంబర్‌లో ఏర్పాటు చేసిన ప్లాట్లు అక్రమమైనవని, అక్రమ లేఅవుట్ జీవో నంబర్ 67 అనుమతులు పొందలేదని, కొనుగోలు చేసిన వారికి గృహనిర్మాణం కోసం అనుమతులు ఇవ్వబడవు అని, ఏమైనా నిర్మాణాలు చేస్తే కూల్చివేస్తామని ఫ్లెక్సీలో వివరించారు.

## దరఖాస్తుల గడువు పెంపు

కాసిపేట, మే 29 : కాసిపేట తెలంగాణ మోడల్ కళాశాలలో ఇంటర్ అడ్మిషన్ల దరఖాస్తు గడువును 31 వరకు పొడిగించిన ట్లు ప్రిన్సిపాల్ నాగ మల్లయ్య తెలిపారు. tsmodel schools.com వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బైపీసీ, ఎంపీసీ, సీఈసీలో (ఇంగ్లిష్ మీడియం) గ్రూపునకు 40 చొప్పున సీట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. పదో తరగతిలో పొందిన మార్కుల ఆధారంగా సీట్ల కేటాయింపు ఉంటుందని, వివరాలకు 95509 32264 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

## ఆవుల అక్రమ రవాణా అరికట్టాలి

బెల్లంపల్లి, మే 29 : ఆవుల అక్రమ రవాణాను అరికట్టాలని గో రక్షక విభాగం జిల్లా లీగల్ అడ్వైజర్ గోలి శ్రీనివాస్ కోరారు. బుధవారం ఏసీపీ రవికుమార్‌కు ఆ విభాగం ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. సంబంధిత ఏరియాల వద్ద చెక్‌పోస్టులను ఏర్పాటు చేయాలని తెలిపారు.

## వడదెబ్బ తో వేర్వేరు చోట్ల ఇద్దరి మృతి

తిరుపతి (ఫైల్)

కన్నెపల్లి/నెన్నెల, మే 29 : కన్నెపల్లి మండలంలోని కాజీపల్లెలో బుధవారం వరి ధాన్యం తూ కం వేసేందుకు వచ్చిన నె న్నెల మండల కేంద్రానికి చెందిన హమాలీ కార్మికుడు తోట తిరుపతి (35) వడదెబ్బతో మృతిచెందాడు. కన్నెపల్లి ఎస్ఐ గంగారం తెలిపిన వివరాల ప్రకారం నెన్నెల గ్రామానికి చెందిన వ్యాపారి కాజీపల్లెలో వడ్లు కొనుగోలు చేయగా తూకం వేసేందుకు తిరుపతి వెళ్లాడు. ఎండలో పని చేయడంతో వడదెబ్బతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య శ్రీలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### అబ్బాపూర్‌లో యువకుడు..

తాండూర్, మే 29: తాండూర్ మండలం అబ్బాపూర్‌కు చెందిన టేకం భీమ్‌రావ్ (26) వడదెబ్బతో మృతి చెందినట్లు మాదారం ఎస్ఐ గొల్లపల్లి అనూష తెలిపారు. భీమ్‌రావ్ సోమవారం తన స్నేహితులతో సోనాపూర్‌లో పెళ్లికి నడుచుకుంటూ వెళ్లి, మంగళవారం రాత్రి తిరిగి ఇంటికి వచ్చాడు. కొద్ది సేపటికే వాంతులయ్యాయి. బెల్లంపల్లి ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందాడు.

## రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

భీమారం, మే 29 : అకాల వర్షాలతో రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని తహసీల్దార్ సదానందం సూచించారు. మండలంలోని పోలంపల్లి, భీమారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం పరిశీలించారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులతో పాటు, నిర్వాహకులు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని సూచించారు.

### నీల్వాయిలో..

వేమనపల్లి, మే 29 : నీల్వాయి గ్రామంలోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం తహసీల్దార్ రమేశ్ సందర్శించారు. ధాన్యాన్ని వెంటనే తూకం వేసి, రైస్ మిల్లులకు తరలించాలని నిర్వాహకులకు సూచించారు. ఆయన వెంట ఆర్ఐ లక్ష్మణ్, సిబ్బంది ప్రేమ్‌రాజ్ ఉన్నారు.

## సర్వసభ్య సమావేశం వాయిదా

చింతలమానేపల్లి, మే 29 : చింతలమానేపల్లి ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం కోరం లేకపోవడంతో మండల సర్వసభ్య సమావేశం వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో కోట ప్రసాద్ తెలిపారు. ఎంపీడీవో డుబ్బుల నానయ్య, ఎంపీటీసీ మనోజిత్ మండల్‌తో పాటు కొన్ని శాఖల అధికారులు మాత్రమే హాజరయ్యారు. తిరిగి సమావేశం నిర్వహించే తేదీని త్వరలోనే ప్రకటిస్తామని పేర్కొన్నారు.

## నేషనల్ ఒలింపియాడ్‌లో ప్రతిభ

నస్పూర్, మే 29 : సెమ్స్ ఒలింపియాడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా నిర్వహించిన నేషనల్ ఒలింపియాడ్-2024లో మంచిర్యాల పట్టణంలోని అభ్యాస పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ప్రత్యేకంగా ప్రకటించిన ఫలితాల్లో అభ్యాస పాఠశాల నుంచి మూడు స్టేట్ ఫస్ట్ ర్యాంకులు వచ్చాయని ప్రిన్సిపాల్ సాన సుధతి తెలిపారు. తమ పాఠశాల నుంచి 26 స్టేట్ ర్యాంకులు, 12 జోనల్ ర్యాంకులు వచ్చినట్లు పేర్కొన్నారు. మంచిర్యాల నుంచి బెస్ట్ పాఠశాలగా నిలువడం గర్వంగా ఉందని పేర్కొన్నారు. ఇందుకు సహకరించిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

మందమర్రి, మే 29 : మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని నార్లాపూర్ గ్రామానికి చెందిన బీర్న కళాకారుడు వెంకటేశ్ కుటుంబానికి చిందోళి కుర్మ కులస్తులు రూ.లక్ష సాయం అందించారు. జగిత్యాల జిల్లా చిందోళి గ్రామంలో బీరయ్య దేవుని పెద్ద పండుగ సందర్భంగా బావిలో లింగాలను తీసే కార్యక్రమంలో పాల్గొన్న వెంకటేశ్, ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతిచెందాడు. నార్లాపూర్‌లో బుధవారం దశదిన కర్మ నిర్వహించగా, చిందోళి గ్రామానికి చెందిన కుర్మ కుల స్తులు విరాళంగా జమచేసి, బాధిత కుటుంబానికి అందించారు. ఈ కార్యక్రమంలో కుర్మ సంఘం జిల్లా అధ్యక్షుడు గుంట శ్రీశైలం, చిందోళి కుర్మ కుల పెద్ద దామరకొండ రాయమల్లు, చిర్రం గోవర్ధన్, ఎత్తిని సత్తయ్య, ఎత్తిని చిన్నయ్య, నార్లాపూర్ కులస్తులు గుంట కొమరయ్య, బండి శంకర్, కోరె సాగర్, కొమ్ము సమ్మయ్య, ఆరె కుమార్, ఉమ్మళ్ల రాజయ్య, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో ఒకరి మృతి

నెన్నెల, మే 29 : నెన్నెల మండలం ఖర్జి గ్రామంలో మామిడికాయలు తెంపుతుండగా, ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగలడంతో పుప్పాల మహేశ్(36) మృతి చెందాడని ఎస్ఐ ప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. నెన్నెలకు చెందిన మహేశ్, అతని భార్య స్వప్న.. సమీపంలోని ఖర్జి గ్రామానికి వెళ్లి, మామిడికాయలు తెంపుతున్నారు. ఈ క్రమంలో చెట్టుపైన ఉన్న 11కేవీ విద్యుత్ తీగలు తగలడంతో అక్కడిక్కడే మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రసాద్ తెలిపారు. మహేశ్‌కు ఇద్దరు పిల్లలున్నారు.

## పోస్టర్ ఆవిష్కరణ

చెన్నూర్ టౌన్, మే 29 : చెన్నూర్‌కు చెందిన చిత్రకళాకారుడు వేల్పుల పోచన్న లైవ్ డ్రాయింగ్‌తో 2017 నుంచి (కశ్మీర్ నుంచి కన్యాకుమారి) చేపట్టిన యాత్ర మంగళవారం ముగియనున్నది. ఈ మేరకు కళాయాత్ర ముగింపు సభ పోస్టర్‌ను పోచన్న మిత్రులు (పదో తరగతి) చెన్నూర్‌లోని పాత ఎమ్మార్వో కార్యాలయం వద్ద ఆవిష్కరించారు. జూన్ 7న చెన్నూర్‌లో సన్మాన సభ ఉంటుందని, పెద్ద సంఖ్యలో కళాకారులు, ప్రజలు హాజరుకావాలని కోరారు.

## చికిత్స పొందుతూ ఒకరి మృతి

జైపూర్, మే 29 : మండలంలోని కాన్కూర్ గ్రామానికి చెందిన నెండుగురి సురేశ్ (32) 27వ తేదీన పురుగుల మందు తాగగా, మంచిర్యాలలోని ఓ ప్రైవేటు దవాఖానలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. బాపు, లక్ష్మిల కొడుకు సురేశ్ మద్యానికి బానిసై, సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ఘనంగా ఎదుర్కోలు

దహెగాం, మే 29 : మండలంలోని గిర్వెలిలో కారు అంజన్న ఆధ్వర్యంలో బుధవారం గ్రామ దేతల ఎదుర్కోలు నిర్వహించారు. భూలక్ష్మీ దేవి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోశమ్మ బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. వేడుకల్లో భాగంగా ప్రధాన పూజారి నాయిని స్వరూప ఆధ్వర్యంలో శివ సత్తులు బోనాలను ఎత్తుకొని నృత్యాలు చేశారు.

బోనాలతో శోభాయాత్రగా వెళ్తున్న మహిళలు

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★ అర్జెంట్‌గా హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ & ITI మెకానిక్స్ కావలెను. మంచి జీతం, వసతి సౌకర్యం కలదు. సంప్ర: 9392663777, 9246663777, 9290003999.

NT-339514-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన

నమస్తే తెలంగాణ

క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679

బెల్లంపల్లి: 91827 77671, 91827 77677

# 'బ్రిలియంట్' విద్యార్థుల సత్తా

నస్పూర్‌లోని బ్రిలియంట్ హైస్కూల్ భవనం

ధర్మారం మే 27: పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రంతో పాటు పలు జిల్లాల్లో నడుస్తున్న బ్రిలియంట్ విద్యాసంస్థల విద్యార్థులు.. విద్యారంగలో రాణిస్తున్నారు. పదోతరగతిలో మంచి జీపీఏలు సాధించడమే కాకుండా నవోదయ లాంటి కేంద్ర విద్యాలయాల్లో గణనీయమైన సీట్లు సాధిస్తున్నారు. గ్రామీణ విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమాన్ని అందించాలన్న లక్ష్యంతో.. ధర్మారం మండల కేంద్రంలో 1995లో తొలిసారిగా ఆంగ్ల మాధ్యమంతో కూడిన పాఠశాలను ఏర్పాటు చేసిన చైర్మన్ సత్యనారాయణ ఆ ప్రస్థానాన్ని అప్రహతీతంగా కొనసాగిస్తున్నారు. అనతి కాలంలోనే.. విద్యార్థులు తల్లిదండ్రుల నుంచి మంచి ఆదరణ పొందడమే కాకుండా.. లక్ష్యానికి అనుగుణంగా ముందుకు దూసుకెళ్తున్నది ఈ విద్యా సంస్థ. తక్కువ ఫీజుతో 36 మంది విద్యార్థులతో ప్రారంభమైన ఈ విద్యాసంస్థ ప్రస్తుతం పెద్దపల్లి ,జగిత్యాల, మంచిర్యాల జిల్లాలో అనుబంధ శాఖలను ఏర్పాటు చేసి.. నాణ్యమైన విద్యనందిస్తున్నది. జాతీయ స్థాయిలో పోటిపడేలా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు ఈ విద్యా సంవత్సరం నుంచే జేఈఈ, నీట్ ఫౌండేషన్ ఏర్పాటు చేస్తున్నది.

### కార్పొరేట్‌కు దీటుగా విద్యాసంస్థలు..

*30 ఏళ్లుగా దాదాపు 200 గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సాధారణ ఫీజులతో కార్పొరేట్ స్థాయి ఉన్నత విద్యనందిస్తున్నాం. ఉన్నత విలువలు కలిగిన విద్యను అందించమే కాకుండా వంద శాతం ఉత్తీర్ణత సాధిస్తున్నాం. ఇప్పటి వరకు 1,222 మంది విద్యార్థులు తమ పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసి.. ఆపై వివిధ ప్రాంతాల్లో ఉన్నత చదువులు పూర్తి చేసి దేశ విదేశాల్లో స్థిరపడ్డందుకుసంతోషంగా ఉంది. మెరుగైన విద్యనందిస్తున్నామని చెప్పడానికి మా గత ఫలితాలే నిదర్శనం. మారుతున్న ప్రపంచీకరణ, కొత్త పుంతలు తొక్కుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దడమే లక్ష్యంగా మా ప్రణాళికలను అమలు చేస్తున్నాం.*

**- సిరిపురం సత్యనారాయణ, చైర్మన్-బ్రిలియంట్ విద్యా సంస్థలు**

# ఇబ్బందుల్లేకుండా ధాన్యం సేకరణ

చెన్నూర్ : మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేక్

చెన్నూర్, మే 29 : రైతులకు ఇబ్బందుల్లేకుండా వరి ధాన్యాన్ని సేకరిస్తున్నామని చెన్నూర్ ఎమ్మెల్యే జీ వివేక్ అన్నారు. చెన్నూర్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి చెప్పినట్లుగా ధాన్యం కొనుగోలు చేస్తామని, అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు పరిహారం ఇస్తామన్నారు. ఏమైనా సమస్యలుంటే పరిష్కరించి, అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగల్ విండో చైర్మన్ చల్ల రాంరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

భీమారం, మే 29 : పార్టీ మండల లీడర్లు భూదందాలు చేస్తే సహించేదిలేదని, అలాంటి వారు తన వద్దకు రావద్దని ఎమ్మెల్యే హెచ్చరించారు. మాంతమ్మ శివారు ప్రాంతంలో కాంగ్రెస్ శ్రేణులు ఆయనకు స్వాగతం పలికారు. భీమారం ఆవుడం క్రాస్ రోడ్డు సమీపంలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు పోడెటి రవి, గుండు తిరుపతి, ఉష్కమల్ల శ్రీనివాస్, నక్క సంపత్, బొల్లం శ్రీనివాస్, బోగె సమ్మయ్య, కట్కూరి ప్రకాశ్ రెడ్డి, పెద్దల బాపు, కోట రవి, ఫక్రొద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

జైపూర్, మే 29 : ఇందారం వద్ద ఎమ్మెల్యేకు నాయకులు స్వాగతం పలికారు. ధాన్యం కొనుగోళ్లు పూర్తిచేస్తామన్నారు. ఇక్కడ పార్టీ యూత్ అధ్యక్షుడు ఆసంపల్లి శ్రీకాంత్, నాయకులు ముక్త శ్రీనివాస్, అరికె సంతోష్, సుంకరి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ చిప్పగుర్తి దుర్గయ్య, షరీఫ్, బేద మల్లేశ్ మున్నా, ప్రశాంత్, టేకుమట్ల ఉప సర్పంచ్ సాగర్, మారుతి పాల్గొన్నారు.

## కొనసాగుతున్న అవగాహన కార్యక్రమాలు

కాసిపేట, మే 29 : కాసిపేట మండలంలోని చింతగూడ, పెద్దనపల్లి గ్రామాల్లో రైతులకు విత్తనాల కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు, నకిలీ విత్తనాలపై వ్యవసాయాధికారి దేవులపల్లి వందన అవగాహన కల్పించారు. లూజు విత్తనాలు క్రయ, విక్రయాలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన, లైసెన్స్ కలిగిన దుకాణాల్లో మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. దుకాణం నుంచి రసీదు తప్పకుండా తీసుకోవాలని, విత్తన ప్యాకెట్, బిల్లును పంట కాలం పూర్తయ్యే వరకు భద్రంగా ఉంచుకోవాలన్నారు. పీఎం కిసాన్ లబ్ధిపొందే రైతులు తప్పనిసరిగా ఈ-కేవైసీ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారులు అంజలి, రమ్య, రైతులు పాల్గొన్నారు.

కోటపల్లి, మే 29 : కోటపల్లి మండలంలోని కొండంపేట, మల్లంపేల, సిర్సా గ్రామాల్లో రైతులకు ఏఈఓ వైష్ణవి అవగాహన కల్పించారు. గ్రామాల్లో నకిలీ విత్తనాల విక్రయాలు జరుగుతున్నట్లు తెలిస్తే వ్యవసాయ శాఖ అధికారులకు తెలియజేయాలని సూచించారు. కొల్లూరులో ఏఈవో శేఖర్.., కోటపల్లిలో ఏఈవో రాజ్ కుమార్ అవగాహన కల్పించారు.

చింతలమానేపల్లి, మే 29 : మండలంలోని గంగాపూర్‌లో ఏఈవో కృపారాణి రైతులకు అవగాహన కల్పించారు. రైతులు అప్రమత్తంగా ఉండాలని, నకిలీ విత్తనాలు సాగుచేసి మోసపోవద్దని సూచించారు.

సిర్పూర్(టీ), మే 29 : సిర్పూర్(టీ) మండలం వేంపల్లి గ్రామంలో ఏఈవో నేహా తబస్సుమ్ రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దండేపల్లి, మే 29 : దండేపల్లి మండలం రెబ్బెన్‌పెల్లిలో ఏఈవో అర్చన రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పొ